సాక్షి వికారాబాద్

బుధవారం । 27 । మార్చి । 2024



ఓటు కీలకం

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



నిరంతరం శ్రమించాలి

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం సాధన చేయాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం సాయంత్రం 6:35	గురువారం ఉదయం 4:51

న్యూస్‌రీల్

జిల్లా ఉత్తమ హెల్త్ విజిటర్‌గా రాజునాయక్



ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజునాయక్

కుల్కచర్ల: ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండలానికి చెందిన కె.రాజునాయక్‌కు జిల్లా ఉత్తమ టీబీ హెల్త్ విజిటర్ అవార్డు లభించింది. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ.. అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయిగౌడ్



సాయిగౌడ్



నవ భారత్‌రెడ్డి

ధారూర్: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా స్టేషన్ ధారూర్‌కు చెందిన సాయిగౌడ్‌ను, జిల్లా కార్యదర్శిగా అంతారం గ్రామానికి చెందిన నవ భారత్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. మాపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మోతాదు మించితే చర్యలు

- ఐపీఎం డైరెక్టర్ శివలీల
- బాటసింగారం మామిడి మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ



బాటసింగారం మామిడి మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న ఐపీఎం డైరెక్టర్ శివలీల

అబ్దుల్లాపూర్‌మెట్: మామిడి పక్వానికి అధికారులు సూచించే రసాయనాలను అనుమతులకు మించి వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్ శివలీల హెచ్చరించారు. మంగళవారం ఆమె బాటసింగారంలో కొనసాగుతున్న గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లోని మామిడి యార్డులో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు విజయ్‌కుమార్, జీఎల్ఎన్‌రెడ్డి, ఖలీల్‌లతో కలిసి ఆకస్మిక తనఖీ చేపట్టారు. ఈ సందర్భంగా యార్డులోని మామిడి ప్యాకింగ్ కేంద్రాలను పరిశీలించారు. మోతాదుకు మించి ఇథిలిన్ ప్యాకెట్లను వినియోగించకూడదని ఆమె హెచ్చరించారు. ప్యాకింగ్ చేసే హమాలీలకు, వ్యాపారులకు రసాయన వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఖరీదుదారుడైన కుమార్ అగర్వాల్ అదనంగా ఇథిలీన్ ప్యాకెట్లు వేసి మామిడి ప్యాకింగ్ చేస్తున్న విషయాన్ని గమనించి 37 బాక్సులను సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ చిలుక నర్సింహారెడ్డి, యార్డ్ ఇన్‌చార్జి ఎస్ఎ లబాన్, సూపర్‌వైజర్లు మురళీధర్, ధర్మేంద్ర, డీఓలు నాయక్, ఉదయ్, కిరణ్, సునీత్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సన్మానం



సీఎం రేవంత్‌రెడ్డితో ఆగిరెడ్డి దంపతులు

చేవెళ్ల: సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎంను సన్మానించారు.

దోమ: గొడుగోనిపల్లిలో బోరులో నీరు రాకపోవడంతో ఎండుతున్న వరి పంట



రైతు కంట నీరు

కరువు దరువేస్తోంది.. భానుడి భగభగలు.. భూగర్భ జలాలను పాతాళంలోకి నెట్టేస్తున్నాయి. తరుముకొస్తున్న కరువు ఛాయలు.. రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. చంటి బిడ్డలా కాపాడుకున్న పంటలు కళ్లెదుటే మాడిపోతుంటే.. వీటిని దక్కించుకునేందుకు అన్నదాతలు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ వివరాలతో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

కోరలు చాస్తున్న కరువు

- వేసవి ప్రారంభంలోనే భానుడి ప్రతాపం
- బోర్లలో పడిపోతున్న నీటిమట్టం
- ఎండుతున్న పంటలు.. కాపాడుకునేందుకు పడరాని పాట్లు



ఎండిన పొలంలో రైతు పాండునాయక్

పరిగి/కొడంగల్/దోమ: బొంరాస్‌పేట మండలం బాపల్లితండాకు చెందిన పాండు నాయక్‌కు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట వేశాడు. పంట పొట్ట దశకు వచ్చే సరికి బోరు బావిలో నీరు అడుగంటాయి. దీంతో పంట ఎండుముఖం పట్టింది. పంట సాగుకు వేల రూపాయలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం అప్పుల్లో కూరుకుపోయాడు. కళ్ల ముందే పంట ఎండిపోతుంటే చేసేది లేక కన్నీటి పర్యంతం అవుతున్నాడు. ఇలాంటి దయనీయ పరిస్థితులు నియోజకవర్గంలో ఎంతో మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

బోరుబావులపై ఆధారపడి..

నియోజకవర్గంలో ఎలాంటి సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో కంది, వరి, పత్తి, పెసర, మినుము, జొన్న పంటలను సాగు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో బోర్ల కింద వరిని అధిక మొత్తంలో సాగు చేశారు. నియోజకవర్గంలో సుమారు పది వేల హెక్టార్లలో వరి పంట వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వడ్డీ కట్టలేని పరిస్థితి



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఎరుకలి కేశవులు. నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాడు. ఇందుకోసం రూ. లక్ష వరకు ఖర్చు చేశాడు. బోరులో నీటి నిల్వ తగ్గడంతో పంట ఎండిపోయింది. రెండు ఎకరాల పంటను పశువుల మేతకు వదిలేశాడు.



కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో ఎండిన వరి పంట



కుల్కచర్ల: చౌడాపూర్‌లో ఎండిన వరి పంట

అప్పులు చేశా



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు చెదురుపల్లి సంజన్న గౌడ్. మూడు ఎకరాల్లో వరి వేశాడు. బోరులో నీరు లేక పంట ఎండుముఖం పట్టింది. అప్పుల పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



కోట్‌పల్లి ప్రాజెక్టు కింద వాడిపోతున్న వేరుశనగ పంట

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అన్నదాత ఆక్రందన

పెద్దేముల్: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు కింద మంబాపూర్, జనగాం, బండపల్లి రైతులు వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారు. సాగునీరు అందకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. బుద్దారం, తింసాన్‌పల్లి, పెద్దేముల్, జనగాం, పెద్దేముల్ తండా, బండపల్లి గ్రామాల్లో కూడి ఇదే పరిస్థితి నెలకొంది.. చాలా గ్రామాల్లో పొలాలు బీడుగా మారుతున్నాయి.

పెట్టుబడి కూడా రాదు



ప్రస్తుత యాసంగి సీజన్‌లో మూడెకరాల్లో వరి పంట సాగు చేశా. బోరులో నీళ్లు బంద య్యాయి. దీంతో పంట ఎండుముఖం పట్టి పశువులకు మేతగా మారింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అప్పు చేసి కొత్త బోరు వేద్దామనుకుంటే నీళ్లు వస్తాయో రావో అన్న భయంతో వేయలేక పోయాం. ప్రభుత్వం తమను ఆదుకోవాలి. లేకుంటే అప్పులపాలవుతాం.

– తిమ్మని కృష్ణయ్య, రైతు, గొడుగోనిపల్లి



దోమ: పశువుల మేతగా వరి పంట

పశువులకు మేతగా..



రెండు ఎకరాల్లో వరి పంట వేశా. నాట్లు వేసిన నెల రోజుల వరకు బోరులో నీరు పుష్కలంగా వచ్చింది. మార్చి నెలలో నీరు అడుగంటడంతో పంట ఎండిపోతోంది. ఈ సారి దిగుబడి వస్తుందనే నమ్మకం లేదు. వరి పంట పశువులకు మేతగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– లక్ష్మి, మహిళా రైతు, తిమ్మాయిలపల్లి, దోమ మండలం

కొడంగల్: నియోజకవర్గంలోని పలు తండాల్లో మంగళవారం పర్యటించా. బోర్లు, బావుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

పరిహారం చెల్లించాలి

సాగు ఖర్చులు మీద పడ్డాయి. కొత్తగా బోరు వేస్తే నీరు వస్తుందో లేదో తెలియని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– సూర్యానాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఇదే స్ఫూర్తితో సాగుదాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పల్వన్‌కుమార్

- టీబీ నియంత్రణలో జిల్లా రెండో స్థానం
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్

అనంతగిరి: టీబీ నిర్ధారణ, చికిత్స, నియంత్రణలో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వికారాబాద్‌లోని రామయ్యగూడ పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎన్‌జీఓలతో సమావేశమయ్యారు. టీబీ నియంత్రణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించి వచ్చే ఏడాది మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. టీబీ నియంత్రణకు విశేష కృషి చేసిన తాండూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గిరిధర్, చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్, ఇతర సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ యాదవ్, పీఓ డాక్టర్ పవిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: గోపాల్‌రెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమానంగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశంలో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా బాధ్యత తీసుకుని పనిచేయాలన్న దానిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. చేవెళ్లకు సీఎం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నందునా నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కష్టపడాలన్నారు. కార్పొరేషన్ నుంచి అత్యధిక మెజారిటీ ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డితో మీర్‌పేట అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

బీజేపీ గెలుపునకు శ్రమిద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- మోత్కూర్‌లో కార్యకర్తల సమావేశం

దోమ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సమష్టిగా శ్రమిద్దామని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మోత్కూర్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు ఇచ్చి ప్రజలను అయోమయానికి గురి చేసిందని మండిపడ్డారు. ఏ ఒక్క గ్యారంటీ కూడా ప్రజలకు అందలేదన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తన పదవీ కాలంలో ఏ ఒక్క గ్రామానికి మంచి చేయలేదని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజలంతా బీజేపీ వెంటే ఉన్నారని, తాను మూడు లక్షల మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బూనేటి మారుతి కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతయ్య, నేతలు యాదయ్య, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహ, రాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులకు 16,536 మంది సిబ్బంది

కలెక్టర్ నేతృత్వంలో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారు లు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకొని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు మొత్తం 16,536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. వీరిలో పీఓలు 4,076 మంది ఉండగా, ఏపీఓలు 3,968, ఓపీఓలు 7,952 మంది, మైక్రో అబ్జర్వర్లు 540 మంది ఉన్నారు. వీరికి ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇది దృష్టిలో ఉంచుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫామ్–12 ను అందజేయాలని ఆదేశించారు.

పకడ్బందీగా నిర్వహణ

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

విద్యుత్‌ తీగల చోరీ

ధారూర్‌: వ్యవసాయ పొలంలోని విద్యుత్‌ స్తంభాలకు ఉన్న మూడు లైన్‌ల తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన ధారూర్‌ శివారులో చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూర్‌ రెవెన్యూ శివారులోని సర్వేనంబర్‌ 452లో బోయిని సత్యమ్మ, అనిత, శశికళ పొలంలోని నాలుగు విద్యుత్‌ స్తంభాలకు ఉన్న మూడు లైన్‌ల విద్యుత్‌ తీగలను దుండగులు అపహరించారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి విద్యుత్‌ సరఫరాను తొలగించి స్తంభాలు ఎక్కి తీగలను తొలగించి చోరీ చేశారు. మంగళవారం పొలానికి వెళ్లిన రైతులు విద్యుత్‌ తీగలు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై రైతు అంజయ్య పోలీసులకు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు.

30న తైబజార్‌ వేలం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తైబజార్‌ వేలాన్ని తిరిగి 30వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ రవీంద్రసాగర్‌ తెలిపారు. పట్టణంలోని రోడ్డుపై రోజువారి మార్కెట్‌, బుధవారం జరిగే సంత ఫీజులు వసూలు చేసే హక్కులను తైబజార్‌ ద్వారా వేలంలో ఎవరైనా దక్కించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22న నిర్వహించిన తైబజార్‌ వేలంలో పాల్గొనేందుకు నిర్ణీత డీడీలు ఎవరూ చెల్లించకపోవడంతో ఈ వేలం వాయిదా పడిందని గుర్తు చేశారు. తిరిగి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్‌ తెలిపారు. నిర్ణీత డీడీలు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

చేపల వేటకు వెళ్లి..

యువకుడి మృతి

షాద్‌నగర్‌ రూరల్‌: చేపల వేటకు వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామ స్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌ మండలం వెలిజర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఏనెగడ్డతండాకు చెందిన రమేశ్‌(30) కూలీ పనులుచేస్తూ నివసించేవాడు. సోమవారం గ్రామ శివారులోని తాళ్ల చెరువులో చేపల వేటకని వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చెరువులోకి దిగాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఈ క్రమంలో అతను ఆరోజు రాత్రి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తాళ్లచెరువులో దిగి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కొక్కానికి తగలడంతో ఒడ్డుకు లాగారు. అక్కడ వారు రమేశ్‌ మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో మృతుని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

- నేడు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ
- కలెక్టర్‌ నారాయణరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌, అడిషనల్‌ కలెక్టర్లు

అనంతగిరి: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని కలెక్టర్‌ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందరికీ అవగాహన కలిగే విధంగా స్వీప్‌ కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం ఎన్నెపల్లి చౌరస్తా నుంచి అలంపల్లి చౌరస్తా వరకు ఉదయం 6 గంటలకు 5కే రన్‌ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌, మెడికల్‌, నర్సింగ్‌ కళాశాలల విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌ శర్మ, లింగ్యానాయక్‌, ఆర్డీఓ శ్రీనివాసరావు, మున్సిపల్‌ కమిషనర్‌ జాకీర్‌ అహ్మద్‌, మైనార్టీ అధికారి సుధారాణి, డివైఎస్‌ఓ హనుమంతరావు, అడిషనల్‌ డీఆర్డీఏ సరోజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్‌ పద్ధతిన విధులు

జిల్లాలో జరిగే సాధారణ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌ విధులు నిర్వహించే పీఓ, ఏపీఓ, ఓపీఓల విధుల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్‌ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్‌ సి.నారాయణ రెడ్డి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌ హాలు నందు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు సిబ్బంది కేటాయింపునకు ఆన్లైన్‌తో మొదటి విడత ర్యాండమైజేషన్‌ పూర్తి చేసినట్లు కలెక్టర్‌ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో కొడంగల్‌, పరిగి, తాండూర్‌, వికారాబాద్‌ నియోజకవర్గాలకు పీఓ, ఏపీఓ, ఓపీఓ పోలింగ్‌ సిబ్బందిని మొదటి దశ ర్యాండమైజేషన్‌ ద్వారా విధులు కేటాయించినట్లు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్‌ ప్రక్రియ తదుపరి మాస్టర్‌ ట్రైనర్లు పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు

అధికారులతో కలెక్టర్‌ సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో నాలుగు పురపాలక సంఘాలు, 565 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 122 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాలలో ప్యాడి క్లీనర్‌, టార్పలిన్స్‌, గన్నిబ్యాగులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కస్టం మిల్లింగ్‌ రైస్‌ (సీఎంఆర్‌) లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ రాజేశ్వర్‌, డీఎం సుగుణ బాయి, అడిషనల్‌ డీఆర్డీఏ సరోజ, మిషన్‌ భగీరథ జిల్లా బాబు శ్రీనివాస్‌, చెల్మారెడ్డి, డీపీఓ జయసుధ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్‌ కండిషన్‌లో ఉండాలి

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి మున్సిపాలిటీ పరిధిలో, గ్రామ పంచాయతీ పరిధిలో బోర్‌ వెల్స్‌, హ్యాండ్‌ పంపులు వర్కింగ్‌ కండీషన్‌లో ఉండేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్‌ సి. నా రాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించా రు. అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు.

వేతనాల్లో కార్మికులకు అన్యాయం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులతో శ్రీనివాస్‌

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని చంద్రవంచ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌ ఆరోపించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. చంద్రవంచ జీపీలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.8,500 జీతం ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇద్దరు కలిసి అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీ పర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ విషయమై ఎంపీఓ రతన్‌సింగ్‌ను వివరణ కోరగా.. సీఐటీయూ శ్రీనివాస్‌ ఆరోపణలు అవాస్తమన్నారు. 950 జనాభా ఉన్న గ్రామానికి ఇద్దరు కార్మికులు ఉండగా.. ప్రస్తుతం గ్రామంలో నలుగురు కార్మికులు పని చేస్తున్నారన్నారు. పనికి తగిన వేతనం ఇస్తున్నామని ఆయన చెప్పారు.

మద్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

ఆమనగల్లు:కిరాణాషాపులో మద్యం విక్రయించేందుకు తీసుకువెళుతుండగా మంగళవారం ఆమనగల్లు పోలీసులు పట్టుకున్నారు. 11.5 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఎండీ హన్రఫ్‌ కిరణాషాపు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఆషాపు లో మద్యం విక్రయించే నిమిత్తం పట్టణంలోని వైన్‌షాపులో కొనుగోలు చేసి ఆటోలో తీసుకువెళుతుండగా చింతలపల్లి గ్రామ సమీపంలో చేపట్టిన సోదాలో మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. మొత్తం 11.5 లీటర్ల క్వార్టర్‌, ఫుల్‌ బాటిళ్లు పట్టుకుని సీజ్‌ చేశారని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళకు గాయాలు


తీవ్ర గాయాలతో పడిఉన్న మహిళ

ధారూరు: గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడిపోయిన సంఘటన మంగళవారం రాత్రి ధారూరు సమీపంలోని ఒంటి మామిడి చెట్టు వద్ద వెలుగు చూసింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆమెను పోలీసులు వికారాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. తల, ముఖంపై తీవ్ర గాయాలైన మహిళ(40) రహదారి పక్కన పడి ఉంది. ఇది గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వేణుగోపాల్‌ 108 వాహనంలో బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. ఆమె ఎడమ చేతిపై శ్రీనివాసు అని తెలుగు అక్షరాలతో పచ్చబొట్టు ఉందని, వివరాలు తెలిసిన వారు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్రషర్‌ క్వారీలో పడి యువకుడి మృతి

కొందుర్గు: క్రషర్‌ క్వా రీలో పడి ఓ యువకు డు మృతి చెందిన సంఘటన కొందుర్గు మండలం గంగన్నగూడ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండ్లకాడి సాయి(26) మంగళవారం స్నేహితులతో కలిసి మండలంలోని గంగన్నగూడ సమీపంలోని ఓ క్రషర్‌ క్వారీలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు సాయి క్వారీలో పడి చనిపోయాడు. స్థానికులు మృతదేహాన్ని వెలికితీశారు. క్రషర్‌ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను తవ్వుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ విషయంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు, మృతుడి కు టుంబ సభ్యులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఎస్‌ఐ కృష్ణయ్య సంఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. మృతుడి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి

- మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న
- ఈఏపీసెట్‌ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న

తాండూరు టౌన్‌: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం సాధన చేయాలని తాండూరు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న అన్నారు. మంగళవారం స్థానిక ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత ఈఏపీసెట్‌, ఎంసెట్‌ కోచింగ్‌ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కృషి, పట్టుదల ఎంతో అవసరమన్నారు. ఇంటర్మీడియేట్‌ పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్‌, మెడిసిన్‌ వంటి ఉన్నత చదువులు చదివేందుకు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా కోచింగ్‌ అందిస్తున్న ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు అభినందనలు తెలిపారు. ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కమాల్‌ అతర్‌, సభ్యుడు అబ్దుల్‌ రవూఫ్‌ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే కోరిక ఉన్నప్పటికీ వారి ఆర్థిక పరిస్థితుల వల్ల కోచింగ్‌ సెంటర్‌లకు వెళ్లలేక పోతున్నారన్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఏటా ఉచితంగా ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ తరఫున కోచింగ్‌ ఇస్తున్నామన్నారు. ఇందుకు ఎంపీ రంజిత్‌రెడ్డి రూ.2లక్షలు, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి సైతం రూ.2లక్షల ఆర్థికసాయం చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ ఫ్యాకల్టీతో 35 రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు వీవీహెచ్‌ఎస్‌ పాఠశాల సమీపంలోని ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన భవనంలో తరగతులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ఉపాధ్యక్షులు అబ్దుల్‌ ఖయ్యూమ్‌, ఖలీలుల్లా షరీఫ్‌, కార్యదర్శి ఖలీద్‌ సైఫుల్లా, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ అబ్దుల్‌ ఖయ్యూం, అబ్దుల్‌ ఖవి, సలీం, లెక్చరర్లు తులసీదాస్‌, పర్యాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంటలో పడి మహిళ దుర్మరణం

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మహిళ మృతిచెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో కొందరు యువకులు క్రికెట్‌ ఆడుతున్న సందర్భంలో సమీపంలోని నింగిసానికుంటలో ఏదో శవం తేలుతూ కనిపించింది. విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఘటనాస్థలానికి చేరుకొని మహిళా మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం ఆమె కుల్కచర్ల గ్రామానికి చెందిన శావుకు వెంకటమ్మ(62)గా గుర్తించారు. ప్రమాదవశాత్తు ఆమె కాళ్లు, చేతులు కడుక్కోవడానికి కుంటలోనికి దిగి అందులోనే పడిపోయి ఉంటుందని కుటుంబీకులు భావిస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

అనంతగిరి: పాత కక్షలు మనసులో పెట్టుకొని మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామ మాజీ సర్పంచ్‌ కమాల్‌రెడ్డిపై దాడి చేసిన కేసులో నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరిచారు. అదే గ్రామానికి చెందిన నాగిరెడ్డిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. మంగళవారం నాగిరెడ్డిని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

బీజేపీతోనే అవినీతిరహిత పాలన

పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌ రెడ్డి


మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్‌ మండలాల పరిధిలోని పోలింగ్‌బూత్‌ ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పార్టీలకు ఓటేస్తే దేశానికి ప్రయోజనం లేదని ఎద్దేవా చేశారు. స్వార్థరాజకీయాలు, ఆస్తులను కాపాడుకోవడానికి మాత్రమే రాజకీయాలు చేస్తున్న వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌ స్థానం భారీ మెజార్టీతో గెలిచి మోదీకి కానుకగా ఇద్దామన్నారు. కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పని చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో తప్ప ఏ ఒక్కరోజు ప్రజల యోగక్షేమాలు తెలుసుకునేందుకు కుల్కచర్ల మండలానికి రాని ప్రస్తుత ఎంపీని మళ్లీ ఎందుకు గెలిపించాలని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, మాజీ పార్టీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, చౌడాపూర్‌ మండల బీజేపీ అధ్యక్షుడు బందయ్య, కుల్కచర్ల మండల అధ్యక్షుడు సురేష్‌, మాజీ అధ్యక్షుడు గాదె మైపాల్‌, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్‌, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు జి.వెంకటయ్య, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీను, నాయకులు ఆంజనేయులు, అంజిలయ్య పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్‌ లక్ష్మారెడ్డి

పీఏసీఎస్‌ చైర్మన్‌ లక్ష్మారెడ్డి

పెద్దేముల్‌: తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లిస్తేనే ఇతర రైతులకు రుణాలు ఇవ్వడానికి వీలవుతుందని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సహకార సంఘంలో మహజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఇతర సొసైటీల్లో అసైన్డ్‌ భూములకు పంట రుణాలు ఇస్తే తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తట్టెపల్లి పీఏసీఎస్‌ పరిధిలో సుమారు 80శాతం రైతులు అసైన్డ్‌ భూములు కలిగి ఉన్నారన్నారు. రైతులకు ఎలాంటి ఎరువుల సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. రైతులకు అందుబాటులో ఎరువులు సిద్ధంగా ఉండేందుకు రూ.80 లక్షల నాబార్డు నిధులతో గోదాం ఏర్పాటు చేశామన్నారు. బంగారు రుణాలకు రూ.కోటి కేటాయించడంతో పాటు స్వయం ఉపాధి రుణాలకు రూ.50 లక్షలు ఇస్తామన్నారు. క్రాఫ్‌ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. చెరుకు పంట సాగుచేసుకున్న రైతులకు ఎకరాకు రూ.50వేల వరకు రుణం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, మాజీ డైరక్టర్‌ నారాయణగౌడ్‌, సీఈఓ రాజమౌళి, ఎంపీటీసీ శంకర్‌, పాలకవర్గం సభ్యులు రహీం, శ్రీరాం, సుక్కమ్మ రైతు సంఘ సభ్యులు జగన్‌, ఏసు, అంజప్ప, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సుద్ద పరిశ్రమలో తనిఖీలు

తాండూరు: ఎలాంటి అనుమతులు లేకుండా సుద్ద తవ్వకాలు చేసి తరలిస్తున్న సుద్ద పరిశ్రమపై గనుల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. మారేపల్లి గ్రామ శివారులో ఉన్న ఫుల్లర్‌ ఎర్త్‌లంప్స్‌ పరిశ్రమను గనుల శాఖ ఏడీ సత్యనారాయణ సందర్శించి సుద్ద నిల్వలను, రికార్డులను పరిశీలించారు. సుద్ద మట్టి తరలింపుకు రాయల్టీ పొందిన ప్రకారం సుద్ద నిల్వలు ఉన్నాయా.. అనే విషయంపై ఆరా తీశారు. అనుమతులకు మించి సుద్ద మట్టి నిల్వలు ఉన్నట్లు గుర్తించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

తాండూరు టౌన్‌: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. పట్టణ సీఐ సంతోష్‌ కుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత తాండూరులోని వెంకటేష్‌ ఇంట్లో గతేడాది డిసెంబర్‌ 12న చోరీ జరిగింది. మరునాడు హఫీజ్‌పేట్‌కు చెందిన అబ్దుల్‌ నసీర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసులో మంగళవారం తాండూరు కోర్టు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శివలీల నిందితునికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.500 జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

ప్లాన్‌ చేశారు.. పట్టుబడ్డారు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

- సినీ ఫక్కీలో గంజాయి పట్టివేత
- నలుగురు నిందితుల రిమాండ్‌
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పరిగి: పాతకక్షలతో ఓ యువకుడిని గంజాయి కేసులో ఇరికిద్దామని అనుకుని ప్లాన్‌ చేసిన వారు కటకటాల పాలైన సంఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన ముషారఫ్‌ పరిగిలో ఓ మెడికల్‌ దుకాణంలో పని చేస్తున్నాడు. పట్టణ కేంద్రానికి చెందిన యూజేఫ్‌కు ముషారఫ్‌తో పాత గొడవలు ఉన్నాయి. ముషారఫ్‌ను ఎలాగైన గంజాయి కేసులో ఇరుకించాలని యూజేఫ్‌ భావించి సయ్యద్‌మల్కాపూర్‌ గ్రామానికి చెందిన వడ్ల సాయిరాం, పట్టణ కేంద్రానికి చెందిన సతీష్‌తో కలిసి నగరానికి చెందిన ప్రశాంత్‌తో ఈనెల 25 మధ్యాహ్నం 207 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి ముషారఫ్‌ కారులో పెట్టి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారించగా.. ముషారఫ్‌ ప్రమేయం లేదని తేలింది. నలుగురు పాతకక్షల కారణంగా గంజాయిని కారులో పెట్టి ఇరుకించేందుకు ప్రయత్నించడంతో అమ్మిన వారిపై, కారులో పెట్టిన వారిపై అందుకు సహకరించిన వారిపై ఎన్‌డీపీఎస్‌ యాక్ట్‌ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌, ఎస్సై సంతోష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో అనుమానాలు!

గంజాయి పట్టుబడిన ఉదాంతంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఓ పోలీసు అధికారి గంజాయి కోసం విభిన్న కోణాల్లో విచారించి చివరకు ప్రమేయం లేనివారిని బలిపశువుగా చేశారని ఆరోపణలున్నాయి. సదరు అధికారి గంజాయి కేసు కోసం ఇన్‌ఫార్మర్‌గా ఉన్న ఓ యువకున్ని అడ్డం పెట్టుకుని డ్రామా ఆడారనే అంశంపై సోషల్‌ మీడియాలో వైరల్‌ అయింది. తనకు ఉన్న టార్గెట్‌ కోసం ప్లాన్‌ ప్రకారం గంజాయి కేసులో ఓ పథకాన్ని రూపొందించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే గంజాయి లేకున్నా కేసు కోసం గంజాయిని తీసుకువచ్చి కారులో పెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో పోలీసు అధికారి, కానిస్టేబుల్‌, ఇన్‌ఫార్మర్‌తో ఆడిన నాటకం వారినే చుట్టుకుంది. గత ఐదు రోజుల క్రితం జరిగిన సంఘటనను ఈనెల 25న జరిగినట్లు చిత్రీకరించి ఈ కేసులో పోలీసుల ప్రమేయం ఉన్న లేకున్నట్లు అమాయకులపై కేసులు పెట్టి బలిచేస్తున్నరని అనుమానిస్తూ స్థానికులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.


ఎన్నికల విధుల కేటాయింపు


మాట్లాడుతున్న జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌ విధులు నిర్వహించే రూట్‌ ఆఫీసర్‌లు, సెక్టోరియల్‌ ఆఫీసర్లకు విధులు కేటాయించినట్లు జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ రాహుల్‌ శర్మ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎన్‌ఐసీ సమావేశం హాలు నందు పోలింగ్‌ విధులు నిర్వహించే రూట్‌ ఆఫీసర్లు, సెక్టోరియల్‌ ఆఫీసర్లకు రూట్లు కేటాయించారు. పోలింగ్‌ కేంద్రాలకు సీరియల్‌ నంబర్ల వారీగా రూట్లను చెక్‌ చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ సూచించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌ రెడ్డి, సెక్టోరియల్‌ అధికారులు, రూట్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొంగ్లూర్‌ చోరీ కేసులో ట్విస్ట్‌

- 28 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారంటూ మరోసారి ఫిర్యాదు


సత్యం బాధితుడు

ఇబ్రహీంపట్నం రూరల్‌: కర్మకాండకు వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్లయిన కేసులో కొత్త అంశం తెర మీదకు వచ్చింది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బొంగ్లూర్‌లో ఈ నెల 18న జరిగిన చోరీలో ఏకంగా 28 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితులు మొర పెట్టుకున్నారు. గతంలో 16 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు యజమాని యాదగిరి ఫిర్యాదు చేశారు. కానీ వాస్తవానికి యాదగిరి, ఆయన భార్య, కుమారుడు, కోడలుకు సంబంధించి 28 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితుడి సోదరుడు సత్యం మీడియా ముందు మంగళవారం వాపోయారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ఈ నెల 16న తల్లి అంత్యక్రియలకు యాదగిరి కుటుంబ సభ్యులందరూ వెళ్లారన్నారు. వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు బొంగ్లూర్‌ రాఘవేంద్ర హోమ్స్‌లోని నివాసంలో బీరువాలో పెట్టారన్నారు. 18వ తేదీన ఇంటి తాళాలు పగలగొట్టి 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. కానీ వాస్తవానికి పోయింది 28 తులాలని బాధితులు తెలిపారు. నాలుగైదు రోజులుగా ఇదే విషయాన్ని చెబుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. తెలిసిన నాయకులతో పైరవీలు చేయిస్తే మరోసారి వివరాలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారన్నారు.

పూర్తి వివరాలు సేకరిస్తున్నాం

దొంగతనం కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. సంఘటనకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఇప్పటికే ఘటన వద్ద రూ.1.75 లక్షలు లభ్యమయ్యాయి. బంగారు ఎక్కువ మొత్తంలో చోరీ అయినట్లు ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తాం.

– రాఘవేందర్‌రెడ్డి, సీఐ, ఆదిబట్ల